ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.6 • కనిష్ఠం 17.7



నిర్మల్
జిల్లా వార్తలు

6

శనివారం 8 మార్చి 2025

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రంలో స్పృహ కోల్పోయిన విద్యార్థి

కడెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థిని స్పృహ కోల్పోయి పడిపోయింది. దీంతో అక్కడే ఉన్న మహిళా కానిస్టేబుల్ లావణ్య హుటాహుటిన ఆమెను కడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి విద్యార్థినికి చికిత్స అందించారు. అనంతరం ఆ విద్యార్థి పరీక్షా కేంద్రానికి చేరుకొని పరీక్ష రాసింది.



విద్యార్థిని ఆసుపత్రికి తరలిస్తున్న కానిస్టేబుల్ లావణ్య



కోతుల పునరావాస కేంద్రంపై నీలినీడలు

- కేంద్రం ఎత్తివేత కోసం సర్కారుకు ప్రతిపాదనలు
- రెండు శాఖల మధ్య సమన్వయం లోపం
- భారమవుతున్న నిర్వహణ ఖర్చులు
- జిల్లాలో ఇక కోతుల సమస్య తీరడం కష్టసాధ్యమే

నిర్మల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని అర్బన్‌పార్క్‌లో ఏర్పాటు చేసిన కోతుల సంరక్షణ కేంద్రంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అటవీశాఖ, పశు సంవర్థక శాఖల మధ్య సమన్వయ లోపంతో పాటు ఆర్థికభారం కూడా ఈ కేంద్రం నిర్వహణకు శాపంగా మారుతోంది. దీంతో పాటు ప్రధానంగా కోతులను వన్య ప్రాణి సంరక్షణ చట్టం పరిధి నుంచి తొలగించడంతో ఇక ఈ కేంద్రాన్ని మూసివేయడమే శరణ్యమని సంబంధిత అధికారులు ఓ నిర్ణయానికి వచ్చారు. ఇందులో భాగంగానే అటవీ శాఖ అధికారులు నిర్మల్‌లోని కోతుల సంరక్షణ కేంద్రాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ముఖ్యంగా రీసెస్ మకాక్ జాతి కోతులను ఇటీవల కేంద్ర అటవీశాఖ వన్య ప్రాణుల సంరక్షణ చట్టం నుంచి తొలగించింది.. మన ప్రాంతంలో నివసించని బానెట్ మకాక్ జాతి కోతులు మాత్రమే వన్య ప్రాణుల సంరక్షణ చట్టం పరిధిలోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈ రకం జాతి కోతులు ప్రస్తుతం తమిళనాడు , కేరళ రాష్ట్రాలకే పరిమితం కాగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రం రీసెస్ మకాక్ జాతి కోతులు నివసిస్తున్నాయి. ఈ కోతులను వన్య ప్రాణుల సంరక్షణ చట్టం నుంచి తొలగించిన నేపథ్యంలో నిర్మల్‌లోని కోతుల పునరావాసం, సంరక్షణ కేంద్రాన్ని ఇక ఎత్తివేయడమే శరణ్యమంటూ అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడగానే ఇక్కడి కోతుల సంరక్షణ కేంద్రాన్ని ఎత్తివేయడం ఖాయమంటున్నారు. 2020 సంవత్సరంలో అర్బన్‌పార్క్‌లో రూ. 2 కోట్లను వ్యయం చేసి ఈ కోతుల పునరావాస సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే పశు సంవర్థక శాఖ నుంచి ఓ పశువైద్యాధికారితో పాటు సిబ్బందిని సైతం నియమించారు. ఇక్కడ కోతులకు పునరావాసం కల్పించడమే కాకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌ను చేస్తున్నారు. అయితే రెండేళ్లు కరోనా కారణంగా ఈ కేంద్రంలో కార్యకలాపాలన్ని నిలిచిపోయాయి. కరోనాకు ముందు కరోనా తరువాత కేవలం 1547 కోతులకు మాత్రమే కు టుంబ నియంత్రణ ఆపరేషన్‌లను చేశారు. ఈ కేంద్రం నిర్వహణకు సంబంధించి వ్యయం కూడా ఎక్కువవుతోంది. కోతులను పట్టించేందుకు గ్రామ పంచాయతీల నుంచి మున్సిపాలిటీల నుంచి పెద్దగా స్పందన లేకపోతుండడం కూడా ఇక్కడి కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లకు ఆటంకమవుతోంది.



కోతుల పునరావాసం కేంద్రంలో కోతికి ఆపరేషన్ చేస్తున్న దృశ్యం

సర్కారుకు చేరిన ప్రతిపాదనలు

కాగా ఇక్కడి కోతుల పునరావాస సంరక్షణ కేంద్రం నిర్వహణ భారంగా మారడంతో పాటు రీసెస్ మకాక్ కోతుల జాతి వన్యప్రాణి సంరక్షణ చట్టం నుంచి మినహాయింపు ఇవ్వ డంలాంటి కారణాలు ఈ కేంద్రం మూసివేతకు ఆస్కారమిస్తున్నాయంటున్నారు. అయితే ఈ నేపథ్యంలో కోతుల సంరక్షణ కేంద్రాన్ని ఎత్తివేసేందుకు అనుమతినివ్వాలంటూ జిల్లా అటవీ శాఖ అధికారి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం చర్చకు తావిస్తోంది. ప్రస్తుతం ఇక్కడి కేంద్రంలో కోతుల కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌ల కోసం అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండడమే కాకుండా ఓ వైద్యుడు, సిబ్బంది సైతం అందుబాటులో ఉన్నారు. అయితే వన్య ప్రాణి సంరక్షణ చట్టంతో పాటు ఆర్థిక భారం పేరిట ఈ సంరక్షణ కేంద్రాన్ని ఎత్తివేసే ప్రతిపాదనలపై స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయంటున్నారు.

రోజు రోజుకు తీవ్రమవుతున్న కోతుల సమస్య

రోజురోజుకు కోతుల తీవ్రమవుతున్న నేపథ్యంలో కోతుల సంరక్షణ కేంద్రాన్ని బలోపేతం చేస్తూ పూర్తిస్థాయిలో సద్వినియోగంలోకి తీసుకురావాల్సింది పోయి ఏకంగా ఈ కేంద్రాన్ని ఎత్తివేసేందుకు చర్యలు తీసుకుంటుండడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ కోతుల జనాభా సంఖ్య పతాకస్థాయికి చేరుకుంది. సాధారణ ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. అలాగే కోతులు దాడుల్లో ఇప్పటికే చాలా మంది తీవ్రంగా గాయపడగా మరికొంతమంది ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలున్నాయి. దీంతో పాటు కోతులు దాడులతో పంట చేనులన్నీ ధ్వంసమవుతున్నాయి. కోతుల గుంపుల దాడులతో రైతులు కంటి మీద కునుకు లేకుండా రాత్రింబవళ్లు కాపు కాయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో పాటు రైతులు పెద్దమొత్తంలో పంటను నష్టపోతున్నారు. ఇలాంటి నేపథ్యంలో కోతుల సంరక్షణ కేంద్రాన్ని మూసి వేసేందుకు సిద్ధమవుతుండడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వన్యప్రాణి సంరక్షణ చట్టం జాబితా నుంచి తొలగింపు

కాగా తెలంగాణ రాష్ట్రంలో రీసెస్ మకాక్ అనే జాతి కోతులు నివసిస్తున్నాయి. గతంలో బానెట్ మకాక్ అనే జాతి కోతులు నివసించేవని కాలక్రమంగా ఈ జాతి కోతులన్ని తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు తరలిపోగా ప్రస్తుతం ఇక్కడ రీసెస్ మకాక్ జాతి కోతులే మిగిలాయి. అయితే కేంద్ర ప్రభుత్వం రీసెస్ మకాక్ జాతి కోతులను వన్య ప్రాణి సంరక్షణ చట్టం జాబితా నుంచి మినహాయించడంతో ఆ కోతులు సాధారణ జంతువులుగా పరిగణించాల్సి వస్తోంది. దీంతో అటవీశాఖ తన ఆధ్వర్యంలోనే కోతుల పునరావాస సంరక్షణ కేంద్రాన్ని నిర్వహించే బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే నిర్మల్‌లోని కేంద్రాన్ని మూసివేసేందుకు అనుమతినివ్వాలంటూ ఇక్కడి డిఎఫ్‌ఓ ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ఈ కేంద్రాన్ని మూసివేసేందుకు అటవీశాఖ చర్యలు తీసుకునే అవకాశం ఉందంటున్నారు.

ఉన్నతాధికారులకు లేఖ రాశాం

• భాను, డిఎఫ్‌ఓ

కాగా కోతుల సంరక్షణ పునరావాస కేంద్రాన్ని మూసివేసే విషయమై ఉన్నతాధికారులకు లేఖ రాశాం. కోతులను వన్య ప్రాణుల సంరక్షణ చట్టం నుంచి మినహాయించడంతో సంరక్షణ కేంద్రాన్ని నిర్వహించాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వం నుంచి మూసివేతకు అనుమతి లభిస్తే దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం అనుమతిని నిరాకరిస్తే కేంద్రాన్ని యధావిధిగా కొనసాగించే అవకాశం ఉంటుంది.



బొలెరో వాహనం బోల్తా

• ఇద్దరికి గాయాలు

సారంగాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాణాపూర్ గ్రామ సమీపంలో నిర్మల్ - ఆదిలాబాద్ రహదారిపై టీఎస్ 18 టీ 7655 అనే బొలెరో వాహనం శుక్రవారం అదుపు తప్పి బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొలెరో వాహనం అతి వేగంగా నడపడంతో అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌తో పాటు కిరణ్ అనే వ్యక్తి తీవ్ర గాయాలు కావడంతో తీవ్ర గాయాలైన క్షతగాత్రులను హుటాహుటిన చికిత్స నిమిత్తం కోస నిర్మల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాద దృశ్యాలు

దిలావర్‌పూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 61వ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంపూర్ గ్రామానికి చెందిన మారుతి అనే ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై లోక సందీప్ తెలిపిన వివరాల ప్రకారం... మారుతి తన ప్యాసింజర్ ఆటోలో దిలావర్‌పూర్ వైపు నుంచి స్వగ్రామం రాంపూర్ వెళ్తుండగా భైంసా వైపు నుంచి అమెజాన్ సరుకుల లోడుతో నిర్మల్ వైపు వస్తున్న గూడ్స్ ఆటో ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఆటో నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ మారుతి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించాలన్న సూచన మేరకు ఆదిలాబాద్ తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. కాగా ఆటోలో ప్రయాణికులు ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

గంగాధర్‌కు ఉత్తమ సామాజిక సేవ అవార్డు

నిర్మల్ కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి చెందిన భూసారపు గంగాధర్ ఉత్తమ సామాజిక సేవ అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ ఈ అవార్డుకు గంగాధర్‌ను ఎంపిక చేశారు. కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా గంగాధర్ ఈ నెల 9న రవీంద్రభారతిలో ఈ అవార్డు అందుకోనున్నారు. ఖానాపూర్ మండల విద్యావనరుల కేంద్రంలో గంగాధర్ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. జాగృతి ఆధ్వర్యంలో సామాజిక సేవలతో పాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

సారంగాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించోలి(ఎం) గ్రామంలో శుక్రవారం వందన ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో వైద్యులు దుర్గాప్రసాద్, సురేష్ గౌడ్, సతీష్ కుమార్‌లు వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరం కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాల్వ నరేష్, గంగాధర్, కార్తీక్ ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదగాలి

• కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని శివాజీచౌక్ నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ అభిలాష అభినవ్ జెండా ఊపి ప్రారంభించారు. బేటీబచావో - బేటీపడావో, మహిళా సాధికారక నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలందరూ స్వశక్తితో జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారన్నారు. ప్రత్యేకంగా జిల్లాలో ఉన్నతస్థాయిలో అధికారులందరూ మహిళలే ఉన్నారని, ఇది చాలా గొప్ప విషయం అని తెలిపారు. మహిళా సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు పరుస్తున్నాయని, అర్హులైన వారందరూ పథకాలన్నింటినీ ఉపయోగించుకొని ఆర్థికంగా బలపడాలన్నారు. ఆడపిల్లల కోసం బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం అమలు పరచి పది సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా గత 45 రోజుల నుంచి జిల్లాలో పలు కార్యక్రమాల ద్వారా మహిళల హక్కులు, చట్టాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, మహిళల రక్షణకు తోడ్పడే పలు హెల్ప్ లైన్ నెంబర్‌లపై అన్ని విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లాలో జీవితంలో మహిళల ప్రాముఖ్యతపై పురుషులచే వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు జిల్లాలో మహిళలకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి (జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్) జి. రాధిక, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, ఏసీడీపీవోలు నాగలక్ష్మి, నాగమణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, మెప్మా పీడీ సుభాష్, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, మిషన్‌శక్తి కోఆర్డినేటర్ సరిత, ఎస్‌హెచ్‌వో మహిళలు, ఎన్‌సీసీ విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు, ఏఎన్‌ఎం, ఆశాలు, మహిళలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా పన్నులు వసూలు చేయాలి

మున్సిపాలిటీలలో నిర్ణీత గడువులోగా అన్ని రకాల పన్నులను వసూలు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అన్ని మున్సిపాలిటీలలో వాణిజ్య, వ్యాపార, ఆస్తి, తదితర పన్నుల వసూలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వాణిజ్య లైసెన్స్‌ల పునరుద్ధరణ వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ వాణిజ్య సముదాయాల అద్దెలను వసూలు చేయాలన్నారు. ఎక్కువ అద్దె బకాయిలు పేరుకపోయిన దుకాణాలను సీజ్ చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్లతో సహా అధికారులందరూ క్షేత్ర స్థాయిలో వెళ్లి పన్నుల వసూలు తీరును పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ పాఠశాలల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... సాంఘిక సంక్షేమ వసతి గృహాల మౌలిక సదుపాయాల కల్పన మరమ్మతుల కొరకు విడుదలైన నిధుల ద్వారా ఆయా పాఠశాలల్లో అవసరమగు మరుగుదొడ్లు, వంట గదులు, ఫ్లోరింగ్, నీటిట్యాంకులు, బోర్డులు, ప్రహరీ గోడ గేట్ల గ్రిల్స్, తదితర మరమ్మతులను పూర్తి చేయాలన్నారు. నిధులను వృధా చేయకుండా అవసరమైన మేరకు పనులను పూర్తి చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, జాదవ్ కృష్ణ, రాజేష్ కుమార్, సాంఘిక సంక్షేమ వసతి గృహ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో సమావేశానికి హాజరైన అధికారులు

రబీ ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

నిర్మల్ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : 2024-25 సంవత్సరానికి సంబంధించిన రబీ ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రబీ 2024-25 కాలానికి సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రానున్న రబీ కాలానికి సంబంధించి పంట విస్తీర్ణం, దిగుబడి అంచనా, తదితర అంశాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. వరి కోతల ప్రక్రియ ప్రారంభం కాగానే వెంటనే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో వరి కుప్పలు పేరుకోకుండా ఉండేందుకు వీలుగా మిల్లింగ్ ప్రక్రియ కొరకు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ఈ ప్రక్రియ సజావుగా జరిగేందుకు సరిపడినంత మంది హమాలీలను, సరిపడినన్ని గన్ని బ్యాగులు, తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు, టార్పాలిన్లు, లారీలు, తదితర సామాగ్రిని సమకూర్చుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చివరి క్షణంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు ఇప్పటి నుంచి తగు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం పక్కదారి పట్టకుండా అంతర్‌రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నిరంతరం పటిష్ట నిఘా ఉంచి వరి ధాన్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, డీఎస్పీ కిరణ్ కుమార్, డీఎం వేణుగోపాల్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, రైస్ మిల్లర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

• జిల్లా విద్యాధికారి రామారావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రామారావు

నిర్మల్ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రెండవ తరగతి శాంపిల్ సర్వేను పకడ్బందీగ నిర్వహించాలని జిల్లా విద్యాధికారి రామారావు అన్నారు. పట్టణంలోని పంచశీల్ బీఎడ్ కాలేజీలో రెండు రోజులుగా జరుగుతున్న ఎఫ్ఎల్ఎస్ రెండవ తరగతి శాంపిల్ సర్వే శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి ఈ నెల 10, 11, 12 తేదీలలో పాఠాల స్థాయిలో 50 పాఠశాలల్లో జరిగే శాంపిల్‌సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో నర్సయ్య, పర్యవేక్షకులు వెంకట రమణ, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ భానుమూర్తి, రిసోర్స్ పర్సన్లు గంగాదాస్, సంగీత పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్



నిర్మల్ అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాంను శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈవీఎం గోదాం వద్ద భద్రత సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలన్నారు. షిఫ్టుల వారీగా భద్రతను పర్యవేక్షించాలని తెలిపారు. సీసీ కెమెరాలు నిరంతరం పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, వైఎస్ఆర్‌సీపీ పార్టీల ప్రతినిధులు భద్రత సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి కార్మిక సమస్యలపై వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నిర్మల్ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సమస్యల సాధన కొరకు శుక్రవారం కేంద్ర మంత్రి నితీన్‌గడ్కరీకి ఢిల్లీలో వినతిపత్రం ఇచ్చినట్లు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. శివకుమార్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీఎంఎస్, టీపీటీఎం అన్ని రాష్ట్రాల్లో ఉన్న కీలక నాయకుల ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల సాధన కొరకు చట్టాలు చేయాలని, సమస్యల గురించి కేంద్ర మంత్రికి కలిశారని తెలిపారు.

అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత



పశువులను తరలిస్తూ పట్టుబడిన వాహనం ఇదే

కుభీర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర నుంచి మండల కేంద్రం మీదుగా శుక్రవారం ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న పశువుల వ్యాను కుభీర్ పోలీసులు పట్టుకున్నారు. సరిహద్దు మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్ నుంచి భైంసా పట్టణం వైపు తరలిస్తున్న ఎంహెచ్ 29 బీఈ 5848 నెంబరు గల బుల్లెరో వాహనం అతివేగంగా తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై రవీందర్ వెంబడించి కుభీర్ మండలం జామ్‌గామ్ క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకొని తనిఖీ చేయగా అందులో విచక్షణ రహితంగా అంత చిన్న వాహనంలో 12 కోడెదూడలను కట్టివేసి ఉన్నాయి. వాహనాన్ని అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పశువులను స్టేషన్ ఆవరణలో ఉంచి నీళ్లు, మేతను అందించారు. గో సంరక్షణ కేంద్రానికి తరలిస్తామని పేర్కొన్నారు.



'అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి'

మావల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): యాదవులు సామాజికంగా, ఆర్థికంగా అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసవేణి నారాయణ యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో మండల కమిటీ ఎన్నికను యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అసుర హన్మాండ్లు యాదవ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ గౌరవ, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా భీమనవేణి సంతోష్ యాదవ్, మర్రి అశోక్ యాదవ్, లోగిటి శ్రీనివాస్ యాదవ్‌లను ఎన్నుకున్నారు. ఇందులో సంఘం జిల్లా నాయకులు కృష్ణ మీనన్, మంగరపు మహేందర్ యాదవ్, రాజేందర్ యాదవ్, ముక్కెర మహేందర్ యాదవ్, రాజన్న, అన్నవరం మల్లేష్, తదితరులున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

బోథ్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మండలంలోని కౌట(బి) గ్రామీణ బ్యాంకులో మహిళా సంఘాల అధ్యక్షులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా పుస్తక నిర్వహణపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మాధవ్, బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో నీటి సమస్యకు పరిష్కారం

బోథ్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బోథ్ బస్టాండులో ఉన్న బోరు బావికి అమర్చిన విద్యుత్ మోటర్ గురువారం చెడిపోవడంతో అక్కడ ఉన్న మరుగుదొడ్లకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో బస్టాండులో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం గమనించిన కంట్రోలర్ సుదర్శన్ వెంటనే మెకానిక్‌ను పిలిపించి బోరుబావిని రాత్రి వరకు మరమ్మతులు చేయించారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి బోరు బావిద్వారా ట్యాంకు నిండడంతో మరుగుదొడ్ల వినియోగానికి ఇబ్బందులు తొలిగిపోయాయి. కంట్రోలర్ చొరవను ప్రయాణికులు అభినందించారు.

నేటి నుంచి శబరి ఆలయ వార్షికోత్సవం

బోథ్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌట(బి) గ్రామంలో గల శబరిమాత 13వ ఆలయ వార్షికోత్సవ వేడుకలను శనివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యంత్ర పూజ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కమిటీ వారు తెలిపారు. పదవ తేదీ వరకు మూడు రోజులపాటు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భక్తులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆశ్రమం కమిటీ వారు కోరారు.

లెప్రసీ రోగులకు కూలర్ అందజేత

ఆదిలాబాద్ రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఆదిలాబాద్ జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, లెప్రసీ రోగులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో కూలర్‌తో పాటు సరకులను అందజేశామని ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ అధ్యక్షుడు ఆదిత్య అన్నారు. గురువారం రాత్రి లెప్రసీ కాలనీలో ఆరు చైర్‌లు, సరుకులు, కూలర్‌ను వారికి అందించారు. వారి ఆరోగ్య సమస్యలతోపాటు ఇతర ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఆదిలాబాద్‌లో ఎండలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఎండ వేడిమి నుంచి రక్షణ పొందేలా లెప్రసీ కాలనీలో కూలర్‌ను అందించడం జరిగిందన్నారు. వీరికి ఇతర సౌకర్యాలు కల్పించేలా తమవంతుగా కృషి చేస్తామని తెలిపారు.



కూలర్, సరుకులను అందజేస్తున్న సొసైటీ సభ్యులు

పూర్తి విచారణ తర్వాతే కేటాయింపులు

● అధికారులతో రివ్యూ మీటింగ్‌లో ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములకు మున్సిపల్ అధికారులు డోర్ నెంబర్‌లు కేటాయించడంతో అవి కబ్జాకు గురవుతున్నాయని, డోర్ నెంబర్ ఇచ్చే సమయంలో అధికారులు అక్కడికి వెళ్లి పూర్తి విచారణ చేసిన తర్వాతనే కేటాయించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. అక్రమ డోర్ నెంబర్‌లు ఇచ్చిన వారిని సస్పెండ్ చేసేంత వరకు ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఆయా అంశాలపై ఎమ్మెల్యే రివ్యూ మీటింగ్ నిర్వహించారు. పట్టణంలో ట్యాక్స్ వసూళు, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు, నీటి సరఫరా, డోర్ నెంబర్ల ఇష్యూ, తదితర వాటిపై సుదీర్ఘంగా చర్చించారు. అంతకుముందు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యేను పరిచయం చేసుకున్నారు. కాగా మార్చి 8న తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా దినోత్సవ వేడుకలకు హాజరు కావాలని నాయకులు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేసుకొని, దర్జాగా మున్సిపల్ ద్వారా డోర్ నెంబర్‌లు తీసుకుంటూ రిజిస్ట్రేషన్‌లు చేయించి ఇతరులకు విక్రయిస్తున్నారన్నారు. దీంతో మున్సిపల్‌కు ప్రభుత్వ స్థలాలు లేకుండా పోతున్నాయన్నారు. గతంలో రెవెన్యూ వారు ఇచ్చిన 2.5 ఎకరాలు, ఇరిగేషన్ వారు ఇచ్చిన రెండెకరాల భూమి కూడా కబ్జాకు గురైందన్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీఈ తిరుపతి, సానిటరి ఇన్స్‌పెక్టర్ నరేందర్, బీజేపీ మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్

● అధికారిక సమావేశంలో నాయకుల హల్‌చల్

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో ఎమ్మెల్యే పాయల్ శంకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చిస్తున్న సమయంలోనే పలువురు మాజీ తాజా కౌన్సిలర్లు సమావేశంలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. కౌన్సిలర్ల పదవి కాలం ముగిసినప్పటికీ వారంతా సమావేశంలో కనిపించడం విమర్శలకు తావిచ్చింది.

రేషన్ బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు

జైనథ్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో సివిల్ సప్లయి ద్వారా అందిస్తున్న బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్‌డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం జైనథ్ మండలంలోని బోరజ్ ఉమ్మడి తనిఖీ కేంద్రమైన బోరజ్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో బియ్యం లారీని పట్టుకున్నారు. జైనథ్‌రూరల్ సీఐ సాయినాథ్ ఎస్సై వి.పురుషోత్తం కథనం ప్రకారం.. ఓ లారీ(యూపీ 25ఇటీ3632)లో 290 క్వింటాళ్ల రేషన్ బియ్యం హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్ బాలాఘడ్‌కు తరలిస్తున్నారు. ఈపీడీఎఫ్ బియ్యం లారీని జైనథ్ రూరల్ సీఐ అదుపులోకి తీసుకున్నారు. లారీ డ్రైవర్ తమీర్, లారీ ఓనర్ ఎండీ నజీమ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సాయినాథ్ తెలిపారు.

చెక్ డ్యామ్‌తో భూగర్భ జలాల పెంపు

నేరడిగొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): చెక్ డ్యామ్‌తో భూగర్భ జలాలు పెరుగుతాయని ఎంపీడీవో రాజ్ వీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దగోండు గూడ గ్రామ అటవీ ప్రాంతంలో చెక్ డ్యామ్ నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చెక్ డ్యామ్ వలన భూమిలో వచ్చే వర్షాకాలంలో వర్షాల వల్ల నీటి శాతం పెరిగి చెట్లు, పశువులకు నీరు అందుతుందన్నారు. చెక్ డ్యామ్ పక్కనే ఉన్న గ్రామానికి నీరు భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావులలో నీరు వస్తుందన్నారు. ఎంపీడీవో వెంట ఎంపీవో లక్ష్మణ్, ఏపీవో వసంత్‌రావు, ఈసీ సుభాష్, ఎఫ్ఏ మురారి, తదితరులు పాల్గొన్నారు.

సనాతన సంప్రదాయాలను చాటి చెప్పాలి

ఇంద్రవెల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సనాతన సంస్కృతీ, సంప్రదాయాలను చాటి చెప్పాలని నారాయణ మహరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక రాధాకృష్ణ ఆలయ ప్రాంగణంలో సనాతన ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో సనాతన ధర్మ వారోత్సవం నిర్వహించారు. ముందుగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణ మహరాజ్ హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తుల ఉద్దేశించి మాట్లాడారు. సనాతన ధర్మం ప్రాచీనమైనదని, దాంతో పాటు శాస్త్రీయత కలిగిన ధర్మంగా విరాజిల్లుతోందని మహరాజ్ ఈ సందరభంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆందునాయక్ తండా మహరాజ్ రాంసింగ్, సనాతన ధర్మ ప్రచార సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ ఉచ్చులో ఉద్యోగులు : ఎస్సై

ఉట్నూర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రజల అమాయకత్వాన్ని డబ్బు ఆశను ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్లు దోపిడీకి పాల్పడుతున్నారని సైబర్‌నేరగాళ్ల ఉచ్చులో ఉద్యోగులు పడుతున్నారని ఉట్నూర్ సబ్ ఇన్స్‌పెక్టర్ మనోహర్ తెలిపారు. గుర్తుతెలియని ఫోన్ నెంబర్ల నుంచి కాల్స్ వస్తే రీసీవ్ చేయవద్దని, తెలియని వాళ్ల ప్రలోభాలకు గురికావద్దని హెచ్చరించారు. ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో కొందరు ఉద్యోగులు అమాయకంగా చిక్కుకొని నష్టపోయారని వెల్లడించారు. ఒక జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న ఒకరు రూ.లక్ష పంపించి తర్వాత మోసపోయినట్లు గ్రహించిందన్నారు. అలాగే, పాత ఉట్నూర్‌కు చెందిన మరో బ్యాంకు ఉద్యోగి సైతం సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోయినట్లు గ్రహించి 1930కు ఫిర్యాదు చేశారన్నారు. ఉట్నూర్‌లో ఇప్పటికే ఇద్దరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడగా.. మరో ఇద్దరూ 1930కు ఫిర్యాదు చేసినట్లు తెలిసిందని వివరించారు. చదువుకున్న వారే అమాయకంగా మోసపోవడం మంచి పరిణామం కాదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజలు గుర్తు తెలియని కాల్స్‌కు స్పందించవద్దని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బోథ్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన గేడెం వినోద్ కుమార్ (25) అనే యువకుడు గత ఫిబ్రవరి 12న పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఈనెల 6న మధ్యాహ్నం నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగిందని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బోథ్‌లో అర్ధరాత్రి 12 దాటితే బైక్ రేసులు

బోథ్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన యువకులు రాత్రి 12 దాటిందంటే మండల కేంద్రం నుండి సమీపంలోని కుచలాపూర్ బస్టాండ్ వరకు బైక్ రేస్లు నిర్వహిస్తున్నారని తెలిసింది. దీనిలో భాగంవగా మండల కేంద్రానికి చెందిన యువకులు కొంతమంది రాత్రి వరకు మందు, విందులతో ఎంజాయ్ చేసిన అనంతరం బైక్ రేసులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. జరగాల్సిన నష్టం జరగకముందే పోలీసు అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. కాగా ఈ విషయమై స్థానిక ఎస్సై ప్రణయ్‌ను వివరణ త్వరగా.. తమ దృష్టికి రాలేదని, అయినా రాత్రిపూట నిఘా పెడుతున్నామన్నారు.

అన్నింటా.. ఆమె!

(5వ పేజీ తరువాయి...)

మార్చి 8న విజయం సాధించారు. అందుకే అప్పటి నుంచి ప్రతి యేటా మార్చి 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు.

చట్టం ఏం చెబుతుందంటే..

1. ఏ పనిలోనైనా స్త్రీ పురుషులకు సమాన వేతనం ఇవ్వాలి.
2. మహిళలను అక్రమ రవాణా చేయడం చట్టరీత్యా నేరం.
3. బలత్కారం నుంచి బయట పడేందుకు అవసరమైతే సదరు వ్యక్తిని హత్య చేసే అధికారం మహిళలకు ఉంది.
4. ప్రభుత్వ కార్యాలయాలల్లో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి.
5. గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం.
6. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.
7. వివాహ సమయంలో వరకట్నం ఇవ్వడం, తీసుకోవడం నేరమే.
8. మహిళలను అకారణంగా, శారీరకంగా, మానసికంగా వేధిస్తే గృహహింస చట్టం కింద కేసులు నమోదు చేయవచ్చు.

అప్పుల బాధ తాళలేక.. పురుగుల మందు తాగి

● ఒక్కరోజు వ్యవధిలోనే దంపతుల మృతి

నేరడిగొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నేరడిగొండ మండలంలో విషాదం చోటు చేసుకుంది. వడూర్ గ్రామానికి చెందిన రైతు ఈదపు పోశెట్టి (60), అతడి భార్య ఇందిరా (52) అప్పుల బాధ భరించలేక బుధవారం ఇద్దరూ పురుగుల మందు తాగారు. అయితే ఈ ఘటనలో రైతు పోశెట్టి గురువారం మృతి చెందగా.. భార్య ఇందిరా పరిస్థితి విషమంగా ఉండడంతో శుక్రవారం ఆమె సైతం మృతి చెందింది. పంట సాగులో నష్టం రావడం, ఇద్దరు పిల్లలకు పెళ్లి చేయడంతో అప్పులు అయ్యాయని మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు. కొన్నేళ్లుగా తన సొంత పొలం రెండు ఎకరాలతో పాటు 14 ఎకరాలు కౌలుకు తీసుకొని పంట సాగు చేశారు. కాగా దిగుబడి రాక పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులతో పాటు ఇద్దరు బిడ్డల పెళ్లిల కోసం చేసిన అప్పులు సుమారు 20 లక్షల రూపాయలు ఎలా తీర్చాలో తెలియక గత కొన్ని రోజుల నుంచి మానసికంగా బాధపడుతూ బుధవారం రాత్రి వారి ఇంట్లో భార్యాభర్తలు ఇద్దరు పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో చుట్టుపక్కల వాళ్ళు గమనించి అదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా ఈదపు పోశెట్టి గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఇందిర పరిస్థితి విషమంగా ఉండగా.. శుక్రవారం ఆమె సైతం మృతి చెందింది. దంపతులు ఆత్మహత్యకు పాల్పడగా.. ఒక్కరోజు వ్యవధిలోనే ఇద్దరూ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జొన్న పంటలో అడవి పందుల బీభత్సం

నేరడిగొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారి గ్రామానికి చెందిన నరేందర్ అనే రైతుకు చెందిన రెండున్నర ఎకరాలలో రబీలో జొన్న పంట సాగు చేయగా శుక్రవారం అడవి పందులు ధ్వంసం చేశాయి. ఆరుగాలం కష్టపడి పంట సాగు చేస్తున్న రైతుకు నిరాశే మిగిలింది. లక్ష రూపాయలు పెట్టుబడికి ఖర్చులు కాగా జొన్న పంట చేతికి వచ్చే సమయానికి అడవి పందులు పంటను మొత్తం ధ్వంసం చేయడంతో రైతు చేసేది లేక పంట సాగు కోసం దాదాపు లక్ష రూపాయలు చేసిన అప్పును ఎలా తీర్చాలో తెలియడంలేదని నరేందర్ అన్నారు. సంబంధిత అటవీ, వ్యవసాయ అధికారులు ఆదుకోవాలని కోరుతున్నారు.

ముగ్గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

ఉట్నూర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని కొత్తగూడ చెక్ పోస్టు వద్ద గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించగా బైకుల పై వచ్చిన ముగ్గురు యువకుల పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశామని ఉట్నూర్ ప్రొబేషనరీ ఎస్సై జీవన్‌రెడ్డి తెలిపారు. మద్యం తాగి ఎవరూ కూడా వాహనాలు నడపవద్దని అన్నారు. మద్యం తాగిన వారు వాహనాలు నడిపినట్లయితే వారితో పాటు ఎదురుగా వచ్చే వాహనాలకు సైతం ప్రమాదాలు జరిగే వీలు ఉంటుందని అన్నారు. వాహనాలు నడిపేవారు ప్రతీఒక్కరు తగిన ఆధారాలు గల కాగితాలను తమవెంట ఉంచుకోవాలన్నారు.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం

నేటి నుంచి శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

● సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయం

● పూర్తయిన ఉత్సవ ఏర్పాట్లు

భైంసా, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్ పరిధిలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో శనివారం నుంచి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవ వేడుకలను వైభవోపేతంగా నిర్వహించేందుకు గాను ఆలయ నిర్వాహక కమిటీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో శోభయమానంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఉత్సవాలలో భాగంగా యజ్ఞం నిర్వహించేందుకు యాగశాలను నిర్మించారు. రాత్రి వేళలో నిర్వహించే ఉత్సవ మూర్తుల ఊరేగింపు కోసం గాను పల్లకిని సిద్ధం చేశారు. ఇప్పటికే ఉత్సవ మూర్తులను, అలంకరణ అభరణాలను శుద్ధి చేసి వేడుకల నిర్వాహణ కోసం సిద్ధం చేశారు. మందిరాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వేలసంఖ్యలో భక్తులు హాజరు కానున్న దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు గాను తగు ఏర్పాట్లు చేపట్టారు. శనివారం నుంచి గురువారం వరకు కొనసాగే ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతినిత్యం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకుగాను చర్యలు చేపట్టారు. వేడుకలలో భాగంగా శనివారం అంకురార్పణం, మూల మూర్తులకు అభిషేకం, నిత్యార్చన కార్యక్రమాల నిర్వహణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.9న ఆదివారం ఉదయం 8గంటలకు యాగశాల ప్రవేశం, గరుడ హోమం, ధ్వజారోహణం, గరుడ ప్రసాదము, సాయంత్రం 6గంటలకు శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం, 10న సోమవారం ఉదయం 10గంటలకు శాంతి పాటము, మూలమంత్ర హవనము, లక్ష్మీనారాయణ హవనము, నిత్యపూర్ణాహుతి, నివేదనలు, బలిహరణము, సాయంత్రం 6గంటలకు శ్రీ విష్ణుసహస్రనామ పారాయణము, 11న మంగళవారం ఉదయం 10గంటలకు శ్రీదేవీ, భూదేవీ సహిత ఎదురుకొల్ల స్నాపకం, ఉదయం 11గంటలకు శ్రీదేవీ, భూదేవీ సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవము, అనంతరం అన్నదానం, సాయంత్రం 6గంటలకు శ్రీ విష్ణుసహస్రనామ పారాయణము, తిరువీది ఉత్సవం, 12న బుధవారం ఉదయం 8గంటలకు సుదర్శన నారసింహ హోమము, సాయంత్రం 7గంటలకు మహిళలచే సామూహిక కుంకుమార్చన , 13న గురువారం ఉదయం 8గంటలకు మహా పూర్ణాహుతి, చక్రస్నానము, సాయంత్రం 6గంటలకు శ్రీపుష్పయాగం, ప్రణయకలహోత్సవం, ఏకాంత సేవ, మహాకుంభ ప్రోక్షణ, మహదాశీర్వచనాలు ఉత్సవ సమాప్తి కార్యక్రమాల నిర్వహణతో వేడుకలు ముగియనున్నాయి.

ఆరోగ్య వివరాలను

హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలి

● నిర్మల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్

నిర్మల్ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య వివరాలను హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ తెలిపారు. శుక్రవారం రోజు మండలంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల డాటా ఎంట్రీ ఆపరేటర్స్‌తో మాట్లాడుతూ... ఆరోగ్య సేవల వివరాలను హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని, నమోదుపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్ పాల్గొన్నారు.

పొన్కల్‌లో ప్రారంభమైన రాజగోపుర ప్రతిష్ఠాపన



వెంకటేశ్వర స్వామి ముందు పూజిస్తున్న రాజగోపుర కలశాలు




పొన్కల్‌లో వెంకటేశ్వర స్వామి రాజగోపురం ఇదే

మామడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్కల్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో నూతనంగా నిర్మించిన రాజగోపురం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన శుక్రవారం అర్చకులు విజయసారథి, రామచంద్రాచార్యులు శాంతి పాఠం, పుణ్యావచనం, అంకురార్పణం, దీక్ష స్వీకరం, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు.

కమీషన్ల కోసమే ఎమ్మెల్యే అభివృద్ధిని అడ్డుకుంటున్నాడు

● ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఎమ్మెల్యే మోకాలడ్డు ● రైతులతో ఈ నెల 10న ఆర్డీవో ఆఫీస్ ముందు భారీ ధర్నా ● గతంలో ఆయన వీక్లీ ప్రస్తుతం మంత్లీ ఎమ్మెల్యే ● ప్రజలు నిలదీసే రోజులు వస్తున్నాయి : మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కమీషన్ల కోసమే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నాడని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్‌వోసీ సర్టిఫికెట్ జారీ కాకుండా అడ్డుకుంటున్నాడని మండిపడ్డారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో పది వేల ఎకరాల్లో అయిల్ పంటను రైతులు సాగుచేస్తున్నారని వివరించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకుంటుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. కొద్దిరోజుల్లోనే పంట చేతికి రాబోతున్నందన్నారు. ఆయిల్ పామ్ గెలల ధర గతం కన్నా ప్రస్తుతం రెండింతలుగా పెరిగిందన్నారు. రైతులకు ఈ పంట ఎంతో లాభదాయకంగా మారబోతుందన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో 25 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఐదు చెక్ డ్యామ్ పనులను సైతం ఆయన అడ్డుకుంటున్నాడని విమర్శించారు. నిర్మల్ అభివృద్ధిని ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక ఆర్ అండ్ బి గెస్టహౌస్ ప్రదేశంలో నిర్మించ తలపెట్టిన హరిత హోటల్ నిర్మాణ పనులను నిలిపి వేయించాడని మండిపడ్డారు. అక్కడ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నిర్మింపజేస్తానంటూ చెబుతుండడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. అమృత్ 2కు సంబంధించిన పనులను సైతం మొదలు కాకుండా చేశాడన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా ఆయన హైదరాబాద్‌కే పరిమితమవుతున్నాడని జిల్లా అధికారులకు కూడా ఆయన సమయం ఇవ్వడం లేదన్నారు. ఇప్పటి వరకు కేంద్రం ద్వారా మంజూరవుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు జరుగుతున్నాయే తప్ప ఎమ్మెల్యే నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయించలేదన్నారు. గతంలో తనపై డీ-1 పట్టాల పేరిట, అలాగే మాస్టర్ ప్లాన్ పేరిట తనపై తప్పుడు ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి ఇప్పటి వరకు వాటిని ఎందుకు నిరూపించలేదని ప్రశ్నిం చారు. కమీషన్‌ల కోసమే ఆయన అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నాడని విమర్శించారు. గతంలో ఆయనకు వీక్లీ ఎమ్మెల్యేగా పేరు ఉండేదని ప్రస్తు తం ఆయనను మంత్లీ ఎమ్మెల్యేగా పిలుస్తున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, రామయ్య, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఐరా నారాయణరెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీగారి రాజేందర్, ఎస్సీ సెల్ నాయకుడు ముడుసు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీకాంత్ యాదవ్, పాకాల రామచందర్, నాళం శ్రీనివాస్, ఇస్మాయిల్, గంగాధర్, అనుముల భాస్కర్, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సోన్ మాజీ సర్పంచ్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని, పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ముథోల్ మాజీ ఎమ్మెల్యే

ముథోల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో శుక్రవారం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, గాంధీభవనంలో తెలంగాణ రాష్ట్ర పీసీసీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను ముథోల్ మాజీ శాసనసభ్యులు జి.విఠల్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రికి ముథోల్ నియోజకవర్గంలో ఉన్న గ్రామ పంచాయతీ పనుల పెండింగ్ బిల్లులు, సీడీపీ, ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండీ ఫరూక్ అహ్మద్ ఉన్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

కుభీర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వరుణ్‌పెట్రోల్ పంపు సమీపంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహ గద్దెను ధ్వంసం చేసిన నిందితులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తు తెలంగాణ ఉద్యమ కారులు కుభీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాయకుడు పుప్పాల పీరాజీ మాట్లాడుతూ తరచూ ఇప్పటి వరకు రెండు మూడు సార్లు తెలంగాణ తల్లి విగ్రహ గద్దె ధ్వంసం చేశారని కాని ఈ సారి ఉద్దేశపూర్వకంగా వాహనంతో గద్దెను గుద్ది ధ్వంసం చేశారన్నారు.

వేసవికాలంలో అంతరాయం లేని విద్యుత్

● విద్యుత్ అధికారి డీఈ నాగరాజు

సోన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయడానికి పాక్‌పట్ల గ్రామానికి కొత్త బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ అధికారి డీఈ నాగరాజు పత్రికా ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ ఫీడర్ బంచ్ ఫీడర్ బ్రేకర్ నుండి వేరు చేయడానికి గాంధీనగర్ వద్ద మిషన్ భగీరథ సేవకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా నిర్వహించడానికి పాక్‌పట్ల గ్రామానికి కొత్త బ్రేకర్ చార్జ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 11 కేవీ ఆదర్శనగర్ లైన్ పక్కన గల మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 6:30 గంటల నుండి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఆదర్శనగర్, రాంనగర్, గాయత్రిపురం, ఆస్రా కాలనీ, ఈద్గాం, భాగ్యనగర్, ఫిష్ మార్కెట్, సిద్దాపూర్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు.


కడెం పెద్ద బెల్లాల్ సబ్‌స్టేషన్ల పరిధిలో..

కడెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కడెం పెద్ద బెల్లాల్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి రామ్‌సింగ్ తెలిపారు. 33/11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

పార్డి(బి) 11/కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ..

కుభీర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్డి(బి) 11/కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ ఆదిత్యపటేల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల దృష్ట్యా ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

మహిళా కానిస్టేబుళ్లకు సన్మానం



నర్సాపూర్(జి), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నేటి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నర్సాపూర్(జి) పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్ల మమత, విజయలక్ష్మి, షహనాబాను, వినితలను నర్సాపూర్(జి) ఎస్సై సాయికిరణ్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రవీందర్, సాయన్న, వసంత్, కానిస్టేబుల్ మహేందర్, సంతోష్, కృష్ణ, మోహన్, షాహిద్‌లు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో నేడు మహిళా దినోత్సవం

నిర్మల్ కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ టీచర్స్ యూనియన్ నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10:30 గంటలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న యాదవ్, జే. లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ భవనంలో నిర్వహించే కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహిళలకు పలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, విజేతలకు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రశంసాపత్రం అందుకున్న కస్తూర్బా గాంధీ విద్యార్థిని

నర్సాపూర్(జి), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని గాయత్రి శుక్రవారం కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రం అందుకున్న విద్యార్థినికి ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

మహిళలే మహారాణులు

● ఇందిరా స్వశక్తి పథకంతో ఉపాధి ● కోళ్ల పరిశ్రమ క్యాంటీన్ల ఏర్పాటు ● ఆదివాసీ ఆహారంలో ఇప్పపువ్వు లడ్డూ తయారీ ● నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కుమురం భీం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఇందిరామహిళా శక్తి క్యాంటీన్

ఉట్నూర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మహిళలను మహారాణులుగా చేస్తామని ప్రకటిస్తున్న ప్రభుత్వం ప్రకటనలకు అనుగుణంగా జిల్లా అధికారులు కార్యచరణ అమలు చేస్తున్నారు. ఫలితంగా జిల్లాలోని ఆదివాసీ మహిళలు మహిళ స్వశక్తి పథకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. జిల్లా కలెక్టర్‌రాజార్షిసా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో మహిళ కోసం కార్యక్రమాలు అందుబాటులోకి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళ స్వశక్తి పథకం కింద క్యాంటిన్లు కోళ్ల ఫారాలు ఏర్పాటుకు అధికారులు సహకరించడంతో మహిళలు ఉపాధి రంగంలో రాణిస్తున్నారు. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ పొచ్చెర, ఉట్నూర్‌లలో మహిళా స్వశక్తి క్యాంటిన్లు ఏర్పాటు చేయాలని భావించి ఉట్నూర్, బోథ్, పొచ్చెర, ఆదిలాబాద్‌లలో ఏర్పాటు చేశారు. దశాబ్దాల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఇందిరా క్రాంతి పథకం ద్వారా మహిళ సంఘాలను ఏర్పాటు చేసిగ్రామ సంఘాలు మండల సమాఖ్యలు, జిల్లా సమాఖ్యలు, ఏర్పాటు చేసి గ్రామైక్య సంఘాల ద్వారా మహిళలను అభివృద్ధి చేయాలని భావించారు. నాటి నుంచి నేటి వరకు మహిళ సమగ్ర అభివృద్ధికోసం కార్యచరణ జరుగుతున్న ఆశించిన ఫలితాలు కొందరికి పరిమితం అయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రవేశ పెట్టిన ఇందిరా స్వశక్తి పథకం కూడా అన్ని ప్రాంతాలలో విస్తరించి మహిళ సంఘాలకు చేయూత ఇవ్వాలని పరిశీలకులు కోరుతున్నారు.

● కోళ్ల వ్యాపారంలో ఆదివాసీ మహిళలు

ఉట్నూర్ మండలంలోని గిరిజన మహిళలను గుర్తించి ఐటీడీఏ అధికారులు ఇందిరామహిళ శక్తి కోళ్ల ఫారంలను ఏర్పాటు చేశారు. కోళ్ల పెంపకం విక్రయం ద్వారా ఆదాయం వస్తుందని గిరిజన మహిళలు పేర్కొంటున్నారు. ఉట్నూర్ మండలంలోని రామలింగంపేటకుచెందిన నైకపు తెగ గిరిజన మహిళలతో పాటు కోలాంగూడకు చెందిన కోలాం పీవీటీజీ గిరిజన మహిళలతో ఐ టీడీఏ అధికారులు ఉట్నూర్ మండలకేంద్రంలోని కొమురంభీం ప్రాంగణలో రెండు కోళ్ల ఫారంలను ఏర్పాటు చేయించారు. ఐటీడీఏ, డీఆర్డీఏ అధికారుల చొరవతో పౌల్ట్రీ ఫారాలు నిర్వహిస్తున్నామని గిరిజన మహిళలు తెలిపారు. రామలింగంపేటకుచెందిన మూతిపోశవ్వ ఆధ్వర్యంలో నలుగురు సభ్యులు, కోలాంగూడ చెందిన కొడప భీంబాయి ఆధ్వర్యంలో నలుగురు సభ్యులు కోలాంగూడ చెందిన కొడప భీంబాయి ఆధ్వర్యంలో నలుగురు సభ్యులు కోడిపిల్లల పెంపకం చేపట్టారు. ఐకేపీ అధికారుల చొరవతో బ్యాంకు అధికారులు ఒక్కొక్క గ్రూపుకు రూ.2.90లక్షల బ్యాంకు రుణం అందించారు. రామలింగంపేట సభ్యులుమొదట 750 కోడి పిల్లలు తెచ్చి 40 రోజుల పాటువాటి ఆలనా పాలన చూసి పెంచడంతో ఒక్కొక్క కోడి 750 గ్రాములు అయ్యాక వాటిని విక్రయించడం ద్వారా తమ గ్రూపుకు రూ.34వేలు ఆదాయం రావడంతో ఒక్కొక్కరు రూ.8500వంతున పంచుకున్నామన్నారు. అంతటితో ఆగకుండా కోడి పిల్లలు తెచ్చి అమ్ముతూ ఉపాధి పొందుతున్నామని వివరిస్తున్నారు.

● ఇందిరా మహిళ స్వశక్తి క్యాంటీన్‌తో ఉపాధి

ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన మహిళ సంఘాల మహిళలను నలుగురిని గుర్తించి అధికారులు ఇందిరా మహిళ స్వశక్తి క్యాంటీన్‌ను కుమురంభీం ప్రాంగణంలో ఏర్పాటు చేయించారు. నలుగురు మహిళలకు ముందుగా రాష్ట్ర రాజధాని భోజనం, టిఫిన్లు ఎలా తయారు చేయాలి. వినియోగారులను ఎలా ఆకట్టుకోవాలి అన్న అంశాల పై వారం రోజుల పాటు శిక్షణ ఇప్పించారు. అనంతరం ఎనిమిది నెలల కింద రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా క్యాంటీన్ ప్రారంభించడంతో మహిళలు ఉపాధి పొందుతున్నారు. మహిళ గ్రూపుకు రూ.2లక్షల రుణం అందించి క్యాంటీన్ మంజూరు చేయడంతో క్యాంటిన్ నిర్వహిస్తూ మహిళలు లాభాలు గడిస్తున్నామని ఉదయం సాయంత్రం ఇంటికి మధ్యాహ్నం రాత్రి ఉదయం సాయంత్రం టిఫిన్లు, మధ్యాహ్నం రాత్రి భోజనం క్యాంటిన్‌లో విక్రయిస్తున్నామని, దీంతో సంతృప్తి ఉందన్నారు.

క్యాంటీన్‌తో ఆదాయం

● బొడ్డు స్వప్న, ఉట్నూర్

ఇందిరా స్వశక్తి క్యాంటిన్ ఏర్పడడం ద్వారా తమకు ఆదాయం వస్తుంది. నలుగురం సభ్యులం కలిసి పనిచేస్తున్నాం. నెలకు ఒక్కొక్కరికి నిర్వహణ ఖర్చులు పోనూ రూ.10వేల వంతున ఆదాయాన్ని పంచుకుటున్నాం.

ఇప్పపువ్వు లడ్డూతో ఉపాధి

● భాగుబాయి, ఆదివాసీ ఆహార కేంద్రం అధ్యక్షురాలు

ప్రకృతిలో లభిస్తున్న ఇప్పపువ్వుతో తాము తయారు చేస్తున్న ఇప్పపువ్వు లడ్డు గిరిజన ప్రాంతాల బాలికల్లో రక్తం వృద్ధి చేస్తుందని, లడ్డుల విక్యంతో తమకు ఉపాధి మెరుగైందని తెలిపారు. ఐటీడీఏ ద్వారా ఇప్పపువ్వు లడ్డూలు కొనుగోలు చేయడంతో తమకు ప్రతీనెల 6 నుంచి 8లక్షల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఖర్చులు పోను సభ్యులందరికీ ఒక్కొక్కరికి రూ.20 వేల ఆదాయం లభిస్తుంది.


క్యాంటిన్‌లో టిఫిన్లు తయారు చేస్తున్న స్వప్న


ఆది వాసీ మహిళలు పెంచుతున్న కోళ్లు

అన్ని రంగాల్లో ఆదర్శం

ముథోల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నేల నుంచి నింగి వరకు వంటింటి నుంచి విదేశీల వరకు అన్నింటా తానై ఆదర్శంగా నిలుస్తుంది మహిళా. నేడు మహిళలు రాణించని రంగం అంటూలేదు. అమ్మ కడుపున మరో అమ్మగా జన్మించిన నాటి నుంచి బాలికగా, విద్యార్థినిగా, గృహిణిగా, మహిళగా, వృద్ధాప్యం వరకు అనేక సమస్యలను ఎదురోడుతూ తన ఉనికిని చాటుతుంది. సృష్టికి మూలం స్త్రీ. ఆమె శక్తియుక్తులు అపారం. ఆమె ఓ ప్రేరణ... ఓ లాలన. ఆమె లేకుంటే ఈ సృష్టి లేదు. దానికి గమ్యం, గమనం లేదు. మనిషికి జీవం, జీ వితమే లేదు. ఆమె లేకుంటే అంతా శూన్యం. అన్నీ తానై నిలుస్తుంది. వివిధ రంగాల్లో పని చేస్తున్న ఎందరో మహిళలు సమైక్య జీవితాన్ని అనుభవిస్తూ ఆయా రంగాల్లో రాణిస్తున్నారు. ఇక్కడి ప్రాంతాల్లో మహిళలు వివిధ రంగాల్లో సత్తా చాటుతున్నారు.

చదువుకుంటేనే సాధికారత

● పి.కవిత, గణిత ఉపాధ్యాయురాలు, ముథోల్



మహిళలు చదువుకున్న నాడే సాధికారత వస్తుంది. గతంలో మహిళల పట్ల ఆంక్షలు ఉండేవి. ప్రస్తుతం లేవు. స్వేచ్ఛగా చదువు కోవచ్చు. ఏ రంగానైనా ఎంచుకొని ముందుకు సాగితే ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఆర్థికంగా వెనుక బాటలో ఉన్నామన్న ఆలోచన ఉండకూడదు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవాలి. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగినప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. మహిళలందరికీ ఉమెన్స్ డే శుభాకాంక్షలు.

స్త్రీ ఒక శక్తి

● కవిత, హిందీ ఉపాధ్యాయురాలు, ముథోల్



స్త్రీ అబల కాదు సబల. నేటి పురుషాధిక్య సమాజంలో దేనికి భయపడాల్సిన పరిస్థితి లేదు. ప్రస్తుత సమాజంలో స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. తల్లిదండ్రులు ఆడ పిల్లలను భారంగా చూడకుండా అదృష్టంగా భావించాలి. మహిళలు తమను తాము కాపాడుకునే శక్తిగా ఎదగాలి. మహిళలు ప్రధానంగా విద్యపై దృష్టి సారిస్తూ ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి. ఆడపిల్లలను విధిగా చదివించాలి.

ప్రతీ ఆడబిడ్డను చదివించాలి

● భోజాబాయి, ఉపాధ్యాయురాలు, వెంకటాపూర్



ప్రతీ తల్లిదండ్రులు తమ ఆడ పిల్లలను విధిగా చదివించాలి. చదువుతోనే సమాజంలో మార్పు వస్తుంది. మహిళలు అన్ని రంగాల్లో ముందుం టున్నారు. ఆడ మగ తేడా ఉండకూడదు. ఇద్దరినీ సమానంగా చదివిస్తే ఆడవాళ్లు కూడా జాబ్ చేసే అవకాశాలు ఉంటాయి. మహిళా సాధికారతకు విద్యే ప్రధానాస్త్రము. విద్యార్థినులు ఉన్నత స్థానాల్లోకి వెళ్లాలంటే గెలుపు ఓటములతో సంబంధం లేకుండా పోటీపడుతూ తల్లిదండ్రుల గౌరవాన్ని పెంచాలి.

మహిళలు ఎందులోనూ తక్కువ కాదు

● సరోజిని, సీడీపీవో, ముథోల్



మహిళలు మగవారి కంటేను తక్కువేం కాదు. సమానంగా పోటీపడి పని చేయవచ్చు. నేను ఒకపక్క ఇల్లాలిగా నావంతు పాత్ర పోషిస్తూనే నా కుటుంబ సభ్యుల సహకారంతో వృత్తి రీత్యా సీడీపీవో ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా నెరవేస్తున్నాను. ప్రతీ మహిళ తమ పిల్లలను విధిగా చదివించాలి. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అంటారు. అందుకే ప్రతి బిడ్డను విధిగా చదివించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని రంగాల్లో మహిళలు ముందుంటున్నారు. వారి ప్రతిభ కనబరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతీ ఆడబిడ్డ అబల కాదు సబల అనే విషయం మరచి పోకూడదు.

కంజర్‌లో ఘనంగా మహిళా దినోత్సవం


మహిళలను సత్కరించిన కంజర్ గ్రామస్థులు

దిలావర్‌పూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంజర్ గ్రామంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను, మాజీ ప్రజా ప్రతినిధులను శాలువాతో సత్కరించారు. మహిళలు ఇంటి బాధ్యతలతో పాటు ఉద్యోగం బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించడంలో ఆమెకు ఆమె సాటి అని గ్రామ ప్రత్యేక అధికారి రాజశేఖర్ అన్నారు. వాస్తవానికి మహిళలు సహనానికి మరో పేరని, వారిని సహనం నశించే వరకు తెస్తే తట్టుకోవడం ఎవరి తరం కాదన్నారు. అమ్మగా, భార్యగా, చెల్లిగా, కూతురుగా ప్రతి పురుషుడికి అండగా నిలుస్తుందని, అమ్మగా అన్నం పెట్టి ప్రేమను పంచుతుందని, భార్యగా సేవలు చేస్తుందని, కూతురుగా తండ్రికి అమ్మలా అందరిస్తుందని అయితే వారిని చులకనగా చూస్తే ఆది శక్తిగా, అపర కాళీగా మారుతుందన్నారు. స్త్రీలను గౌరవిస్తే అమ్మలా, ఒక చెల్లిలా అందరిస్తుందన్నారు. వారి రుణం ఎన్ని జన్మలెత్తిన తీర్చుకోలేమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ నమూనా ఇంటికి శ్రీకారం


ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇల్లు (నమూనా)

ఇచ్చోడ, మార్చి, 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం రూపుదాలుస్తోంది. రూ. 5లక్షల వ్యయంతో ప్రతీ మండలంలో నమూనా ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్తు కార్యాలయం ఆవరణలో నమూనా ఇంటి నిర్మాణాకి శ్రీకారం చుట్టింది.

420 చదరపు అడుగుల విస్తీర్ణంలో..

ఇచ్చోడ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నమూనా గృహాల నిర్మాణం జరుగుతోంది. నిర్మాణాలు ప్రారంభమైన చోట్ల స్లాబు వేసి ప్లాస్టింగ్ చేసి రంగులు వేస్తే ఇంటికి రూపం వస్తుంది. 420 చదరపు అడుగుల విస్తీరణం (18-24 ఫీట్లు) లో వీటిని రూపొందిస్తున్నారు. ఇందులో ఒక పడకగది, హాల్, కిచెన్, లోపల బయట టాయిలెట్ నిర్మిస్తున్నాం. ఈ నమూనా గృహాలు భవిష్యత్తులో మండల గృహా నిర్మాణ శాఖ ఏఈ కార్యాలయాలుగా మారనున్నాయి. ఇక్కడి నుంచి అధికారలు కార్యకలాపాలు నిర్వహించనున్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు ప్రారంభం

తలమడుగు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదల కోసం ఇంద్రమ్మ ఇల్లు నిర్మించేందుకు నూతనంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనుల గాను వాటికి సంబంధించిన మోడల్ హౌస్ నిర్మించేందుకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ నసీర్‌లు పనులను ప్రారంభించారు. మోడల్ హౌస్ నిర్మాణం త్వరలోనే పూర్తి చేసి లబ్ధిదారులందరికీ చూపించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఇందిరా మహిళ నిర్మాణంలో ఎస్సీ, ఎస్టీలకు ఆరు లక్షలు, ఇతరులకు ఐదు లక్షల రూపాయలతో ఇండ్ల నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా మండలంలోని లక్ష్యంపూర్ గ్రామంలో 120 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.

సమయానికి రాని హెచ్‌ఎం మాకొద్దు..!

● ధన్నూర్ జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడి వాహనాన్ని అడ్డుకున్న విద్యార్థులు


ప్రధానోపాధ్యాయుడి వాహనాన్ని అడ్డుకుంటున్న విద్యార్థులు

బోథ్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్నూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమయానికి రాకపోవడం వల్ల తమ ఇబ్బందులు తలెత్తుతున్నాయని పాఠశాల 10వ తరగతి విద్యార్థులు వాపోయారు. శుక్రవారం ఈ ప్రధానోపాధ్యాయుడు తమకు వద్దంటూ ఆయన వచ్చిన వాహనానికి అడ్డుగా నిలిచారు. దీంతో గ్రామస్థులు జోక్యం కల్పించుకొని పాఠశాల ఆవరణలో చర్చలు జరిపారు. గురువారం పాఠశాల నడుస్తున్న సమయంలో ఓ వ్యక్తి పాఠశాలలోకి తప్ప తాగి వచ్చాడని దీంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పేర్కొన్నారు. అయితే మద్యం తాగిన వ్యక్తి పైన పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆయనను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లడం జరిగింది. అనంతరం శుక్రవారం గురువారం జరిగిన సంఘటనను ఆధారం చేసుకుని విద్యార్థులు తమకు పాఠశాలలో రక్షణ లేదని సకాలంలో హెడ్మాస్టర్ రావడం లేదని దీంతో తమను పట్టించుకునే వారు లేరని విద్యార్థులు వాపోయారు. అయితే పాఠశాలలో నెలకొన్న సమస్యల వల్ల తాము సరైన చదువులకు నోచుకోలేక పోతున్నామని విద్యార్థులు వాపోయారు. నిలదీసి అడిగితే టిసి ఇచ్చి పంపుదామని హాల్ టికెట్లు ఇవ్వమని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు.

● హిందీ ఉపాధ్యాయుడు లేక నష్టపోతున్నాం

తమ పాఠశాలకు చెందిన హిందీ ఉపాధ్యాయుడు అనారోగ్య కారణాల వల్ల రాలేకపోయాడని దీంతో తాము హిందీ నేర్చుకోలేక పోతున్నామని విద్యార్థులు విలేకరుల ముందు వాపోయారు. ఆయన స్థానంలో మరో ఉపాధ్యాయుడిని నియమించి ఉంటే ఈ దుస్థితి నెలకొనేది కాదని వాపోయారు. రానున్న పరీక్షల్లో తాము హిందీ పరీక్ష రాసేది ఎలా అని ప్రశ్నించారు.

● గ్రామస్థులు సముదాయించినా వినని విద్యార్థులు

ఉపాధ్యాయుడు నిధులకు గైర్హాజరవుతున్న విషయాన్ని నిరసిస్తూ విద్యార్థులు పాఠశాల బయట ఆందోళన దిగడంతో గ్రామస్థులు విద్యార్థులను సముదాయించారు. అయినా తాము వినేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు.

● విధులకు గైర్హాజరు కావడం లేదు: హెచ్‌ఎం

విద్యార్థులు ఆరోపించినట్లుగా తాను విధులకు గైర్హాజరు కావడం లేదని ఏదైనా పని ఉంటే కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యుడిగా అదిలాబాద్‌లో పనులు చేసుకొని కొంత ఆలస్యంగా వస్తున్నానన్నారు. అయితే ఈ విషయం విద్యార్థులకు తెలియక తన పైన ఆరోపణ చేస్తున్నారన్నారు. విద్యార్థుల ఆరోపణ వెనుక కొంతమంది వ్యక్తుల ప్రమే యం ఉందని పేర్కొన్నారు.

● సమస్యపై చర్చించిన విద్యా కమిటీ వీడీసీలు

పాఠశాలలో నెలకొన్న సమస్యలపైన శుక్రవారం వీడీసీ అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షులు వనితల ఆధ్వర్యంలో చర్చించారు. విద్యార్థులు సంయమనం పాటించాలని సమస్యలను పరిష్కరిస్తామని సూచించారు. ఏది ఏమైనా పాఠశాలలో చదువులు సక్రమంగా సాగడం లేదన్న సంకేతాలు వస్తున్నాయి.

ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

బోథ్ మండలంలోని దన్నూరు గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తక్షణమే ఆయనను సస్పెండ్ చేయాలని టిజీవీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సాయంత్రం పరీక్షలకు సనార్థమయ్యే సమయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసే విధంగా మందుబాబులు పాఠశాలలోకి ప్రవేశించడం సరైంది కాదన్నారు. ఈ ఉపాధ్యాయుడి పనితీరు పట్ల గ్రామస్తులు విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు విలేకరుల సమావేశంలో పలువురు టీజీవిపి నాయకులు ఉన్నారు.


మాట్లాడుతున్న విద్యార్థినులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్చోడ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని విద్యుత్తు శాఖ ఏఈ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఇచ్చోడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మెయి న్టనెన్స్, విద్యుత్ తీగల సవరణలతో పాటు తదితర పనులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, పరిధిలోని విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.


జిల్లా నూతన ఎస్పీ అఖిల్ మహాజన్


కరీంనగర్ సీపీగా బదిలీపై వెళ్తున్న గౌస్‌ఆలం

జిల్లా నూతన ఎస్పీగా అఖిల్ మహాజన్

- గౌస్‌ఆలం కరీంనగర్ కమిషనర్‌గా బదిలీ

ఆదిలాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా అఖిల్ మహాజన్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు జిల్లా ఎస్పీగా కొనసాగిన గౌస్ ఆలం కరీంనగర్ కమిషనర్ ఆఫ్ పోలీసుగా బదిలీపై వెళ్లారు. రాజన్న సిరిసిల్లా జిల్లా ఎస్పీగా పని చేసిన అఖిల్ మహాజన్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇన్నాళ్లు జిల్లా ఎస్పీగా పని చేసిన గౌస్‌ఆలం జిల్లా పాలనపై ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. నేరుగా ప్రజలతో మమేకమవుతు అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎన్నో చర్యలు తీసుకున్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

మహిళలతోనే సంస్కృతీ, సంప్రదాయాల రక్షణ : పీవో

ఉట్నూర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఇంటికి దీపం ఇల్లాలు అన్నవిధంగానే సంస్కృతీ, సంప్రదాయాలను మహిళలు కాపాడుతున్నారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాంగణలో ఉన్న డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ సంవదర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శతాబ్దాలుగా మన వారసత్వం, సంస్కృతీ, సంప్రదాయాలు మహిళలను ఆదిశక్తిగా ఆరాధిస్తూ గౌరవిస్తున్నాయని పేర్కొన్నారు. సమసమాజ స్థాపనకు లింగ సమానత్వపు స్ఫూర్తి పెంపొందించడం, మహిళలు అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారని కొనియాడారు. చదువును డిగ్రీతో ఆపేయకుండా కొనసాగించాలని, నచ్చిన రంగంలో ఉద్యోగం సాధించాలని అన్నారు. ఇందులో అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞ అభినవ్, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నింటా.. ఆమె!

- జిల్లాలో పలు రంగాల్లో దూసుకెళ్తున్న మహిళలు
- పురుషులతో సమానంగా రాణింపు
- పాలకుల నిర్లక్ష్యం.. అమలుకు నోచుకోని చట్టాలు
- మహిళలపై ఆగని వేధింపులు.. అంతటా అదే వివక్ష
- నేడే అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఆదిలాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): లాలించే అమ్మగా.. ప్రేమను పంచే అర్ధాంగిగా.. అప్యాయతను చూపే సోదరిగా.. ప్రియురాలిగా.. ఎన్నో పాత్రలు పోషిస్తూ అప్యాయతా, అనురాగాలకు మహిళలు మారుపేరుగా నిలుస్తున్నారు. మహిళలంటే వంటింటికే పరిమితం కాదని ఎందులోను తగ్గేదే లేదంటూ ముందుకు దూసుకెళ్తున్నారు. పలు రంగాల్లో ప్రతిభను కనబరుస్తూ అద్భుతమైన ఫలితాలను రాబట్టి అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. గల్లి నుంచి ఢిల్లీ వరకు రాజకీయాలు, ఉన్నత పదవుల్లో రాణిస్తూ ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్నారు. అంది వచ్చిన అవకాశాలను ఆయుధంగా మల్చుకొని ఆకాశమే హద్దుగా... అన్నింటా ముందుగా నిలుస్తున్నారు. అంతేకాకుండా ఇప్పటికీ సమాజంలో మహిళల పట్ల కొంత వివక్ష కొనసాగుతోంది. అలాగే మహిళలపై వేధింపులు పెరిగిపోతున్నా.. మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతియేడు మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో జిల్లావ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.

నేపథ్యం ఇదీ..

ప్రతియేటా మార్చి 8 ఎంతో ప్రాధాన్యత గల రోజుగా చరిత్ర పుటల్లో నిలుస్తుంది. 1857 మార్చి 8న అమెరికాలో పశ్చిమ పెన్సిల్వేనియా ప్రాంతంలోని ఒక వస్త్ర పరిశ్రమలో 10 గంటల పని దినాలు, పురుషులతో సమానమైన వేతనం కోసం వేలాది మంది మహిళలు సమ్మెకు దిగారు. ఈ సమ్మెలో

(తరువాయి 6వ పేజీలో...)

మహిళా హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

: కుమ్ర ఈశ్వరీబాయి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు



మహిళల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అలాగే వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పరంగా తోడ్పాటును అందిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం సఖీ కేంద్రాల ద్వారా మహిళల పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతుంది.ఎలాంటి ఇబ్బందులు ఎదురైన 181 టోల్ ఫ్రీ నెం.కు కాల్ చేస్తే పోలీసులు తక్షణమే స్పందిస్తారు. జిల్లాలో ప్రధానంగా ఆదివాసీ మహిళల్లో చైతన్యం తెచ్చేందుకు పలురకాల ప్రయత్నాలు చేస్తున్నాం. ముఖ్యంగా మహిళ సాధికారతను సాధించే దిశగా అడుగులు వేస్తూ మహిళలకు అండగా నిలుస్తున్నాం.

చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

: రంగినేని మనిషా, మాజీ మున్సిపల్ చైర్మన్, ఆదిలాబాద్



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అనేక చట్టాలను తెచ్చిన అవి ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు. ఈ చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తే పురుషుల కంటే ఎక్కువగా మహిళలు రాణించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో దూసుకు పోతున్నారు. మహిళలు వంటింటికే పరిమితం కావడం ఒక్కప్పటి మాట. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండి హక్కుల కోసం పోరాటం చేస్తూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి.

మహిళలకు చదువే ప్రధాన ఆయుధం

: డా.సాధన, డిప్యూటీ డీఎంహెచ్‌వో



మహిళలకు చదువే ప్రధాన ఆయుధం. చదువుతోనే సమాజ అవగాహన కలుగుతుంది. ఎన్ని కష్టాలు ఎదురైన తప్పని సరిగా చదువుకోవాలి. మహిళల సంరక్షణ కోసం ప్రభుత్వం మరిన్ని పథకాలను అమలు చేయాలి. చదువుకుంటేనే సమాజంలో గౌరవం, ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. మహిళలు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలి. ఇల్లాలు విద్యావంతురాలైతే ఆ కుటుంబం ఎంతో ఆరోగ్య వంతంగా ఉంటుంది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

: కంది మౌనారెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు, ఆదిలాబాద్



మహిళలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలి. ముఖ్యంగా రాజకీయాల్లో వెనుకబాటుతనాన్ని పొగొట్టాలి. ఏ రంగంలోను మహిళలు తక్కువ కాదంటూ నిరూపించాలి. మహిళలు, మహారాణులు అంటున్నారే తప్ప దాన్ని ఆచరణ సాధ్యమయ్యేలా ప్రభుత్వం, పాలకులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రయత్నం చేయాలి. ధైర్యంగా ముందుకెళ్తేనే విజయ అవకాశాలు వెతుకుంటూ వస్తాయి.


సోనాలలో నల్లా వద్ద ఉదయం తాగునీటి కోసం వేచి ఉన్న స్థానిక కాలనీవాసులు

'తాగునీటి ఎద్దడిని నివారించండి'

బోథ్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలో గత వారం రోజుల నుంచి తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొందని, అధికారులు తక్షణమే స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ భీమ్రావు పాటిల్ అధికారులను కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో గత 30ఏళ్ల కాలంగా గ్రామానికి చెందిన వసంతరావు అనే వ్యక్తి ఉచితంగా నీటిని అందించాడని, అయితే ఈ ఏడాది వర్షాలు సరిగా కురవక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయని వాపోయారు. అధికారులు ముందు జాగ్రత్తగా నీటిఎద్దడి నివారణపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం ఇంతవరకు రేషన్ షాపులకు చేరకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, నీటి ఎద్దటి ఉన్న గ్రామాలను గుర్తించి బోరు బావులు వేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం పలు గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజలు చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించడానికి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో నీటి ఎద్దటి ఉన్న గ్రామాలను గుర్తించి సమాచారం అందించాలని కార్యకర్తలకు సూచించారు. ఆ గ్రామాల్లో బోరుబావులు వేస్తామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక తోడ్పాటుకు చేయూత

- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ఫ్ ఆధ్వర్యంలో గిరిజన మిల్లెట్ బిస్కెట్ యూనిట్‌ను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే బొజ్జు

ఇంద్రవెల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకకృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అందునాయక్ తండా రోడ్ ఇందిరా మహిళా సమాఖ్య కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ఫ్ ఆధ్వర్యంలో గిరిజన మిల్లెట్ బిస్కెట్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లు నెలకొల్పి ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తున్నామన్నారు. మహిళలు తయారు చేస్తున్న బిస్కెట్లుపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం మహిళలు తయారు చేసిన బిస్కెట్లను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ రాథోడ్ రవీందర్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్రం ఈశ్వరిబాయి, ఐకెపి ఏపీఎం రాథోడ్ రామారావు, సీసీలు దేవసింగ్, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.


మిల్లెట్ బిస్కెట్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్

- పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఇంద్రవెల్లి: పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలంటే స్వయం ప్రణాళిక, పాఠ్యాంశ పునశ్చరణతో పాటుగా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీ పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల స్క్రీనింగ్ పరీక్షలు, మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అని ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకొన్నారు. వంటగదిని పరిశీలించి అన్నం రుచి చూశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చేస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను దగ్గరుండి పరిశీలించి, నేటి నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ టెస్టును మొదటిరోజు మండలంలోని కేజీబీవీలో ప్రారంభించడం జరిగిందని, ఆర్‌బీఎస్‌కే టీమ్ ద్వారా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ స్క్రీనింగ్‌లో 45 రకాల పరీక్షలు చేయడం జరుగుతుందని, ఈ టెస్టుల వల్ల వారి నేర్పు, ఆరోగ్యం, మానసిక పరిస్థితులను తెలుసుకొని మెరుగైన వైద్యం అందించి, ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతీ గురువారం విద్యార్థులకు ఇచ్చే ఐరన్ ఫోలిక్ మాత్రలు ఇచ్చారా? లేదా? అని అడిగి తెలుసుకొని, డబ్ల్యూఐఎఫ్ఎస్ యాప్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని, 5 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాల పిల్లలకు పింక్ కలర్ మాత్రలు, 10 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల పిల్లలకు బ్లూ కలర్ మాత్రలు, ప్రతీ గురువారం మధ్యాహ్నం భోజనం అనంతరం అందించాలని అన్నారు. ఎండాకాలం దృష్ట్యా ఆశ వర్కర్స్ ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని అన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనం తయారీ తీరును పరిశీలించి అన్నం రుచి ఎలా ఉందో? స్వయంగా తిని చూశారు. కలెక్టర్ వెంట ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో బాస్కర్, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్ రావు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

- ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని క్రిసియంట్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్‌తో కలిసి తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీసీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా ? లేదా ? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏఎన్ఎం, టాయిలెట్స్ అందుబాటుపై ఆరా తీశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని పరీక్షల సిబ్బందికి సూచించారు. ఆన్సర్ షీట్లను తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రతీ మహిళ విజయం వెనక పురుషుడు ఉంటాడని, వారి ప్రోత్సాహం లేక మహిళలు రాణించలేరని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా దినోత్సవ ప్రత్యేక గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళ దినోత్సవం సందర్భంగా ప్రతీ ఒక్కరు మహిళాలను గౌరవించేల ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

ఆదిలాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం బేల మండలం సాంగిడి గ్రామంలో నిర్వహించిన శ్రీసంత్ తుక్‌డోజి మహరాజ్ 56వ పుణ్యతిథి, మోతిజి మహారాజ్ 27వ పుణ్యతిథి వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సప్తాహలో ఎమ్మెల్యే పాల్గొని పల్లకీని మోశారు. కులమతాలకు అతీతంగా కలిసి కట్టుగా ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ప్రవీణ్ మురళిధర్, దత్తా తదితరులున్నారు.

పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

నేరడిగొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని వడూర్ గ్రామస్థులతో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశం లో మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో దంపతుల ఆత్మహత్య తదితర జరిగిన సంఘటనలు, రంజాన్ పండుగ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరుగకుండా గ్రామస్థులకు అవగాహనా కల్పించారు. రంజాన్ పండుగ సందర్భంగా అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. గ్రామంలో గుర్తు తెలియని అనుమానిత వ్యక్తులు వస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామరు, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
ఇఫ్తార్	సహర్
సా.6.30	ఉ.5.07



కొనుగోలు, అమ్మకాలలో ఇచ్చిన అప్పులను తిరిగి రాబట్టుకోవడంలో.. నెమ్మదిని, నమ్రతను, మంచి నడవడికను ప్రదర్శించే వ్యక్తిని దైవం (అల్లాహ్) కరుణిస్తాడు.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు : డీఈవో

తలమడుగు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామని జిల్లా విద్యాధికారి ప్రణీత కోరారు. శుక్రవారం మండలంలోని దేవపూర్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభం కాను న్న పదో తరగతి పరీక్షల నిర్వాహణకు జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు చేపడుతున్నామని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 52 పరీక్ష కేంద్రాలు గాను 10,106 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతేకాకుండా ఈ సంవత్సరం జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు గత మూడు నెలల నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, స్నాక్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఉపాధ్యాయులు అందించిన సలహాలు, సూచనలు ఇలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరుకావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పరీక్షలు సంబంధించిన జవాబులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు, తదితరులు పాల్గొన్నారు.


దేవపూర్ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేస్తున్న డీఈవో ప్రణీత